

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్ : పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను మార్చి 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణ ఉదయం 6.00 గంటల నుంచి 7.15 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండవ బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి-కడప అర్బన్

రైతు క్షేమంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కౌలు రైతులకు పిఎం కిసాన్ 'వైఎస్ఆర్ రైతు భరోసా 5వ ఏడాది 3వ విడత ఆర్థిక సాయంతో పాటు, రబీ 2021-22, ఖరీఫ్ 2022కు సంబంధించి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కిరైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఓబుల కొండారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ విజయ్ రామరాజు అతిధులతో కలిసి జిల్లాలో పిఎం కిసాన్ వైఎస్ఆర్ రైతు భరోసా ద్వారా వరుసగా 5వ ఏడాది 3వ విడతగా జిల్లాలో 2,10,625 మంది రైతులకు గాను రూ.42,29,21,000 లతో పాటు 41,828 మంది రైతులకు రూ.10,54,76,311 మేరా వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో రైతులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా కౌలు రైతులతో పాటు దేవాదాయ, అటవీ భూములను సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపచేశారని పేర్కొన్నారు. మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే అందించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకారణంగా దెబ్బతిన్న పంటలకు సంబందించిన నష్ట పరిహారాన్ని ఆ సీజన్ ముగిసేలోపే అందించారని



మహిళా రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

తెలిపారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధగా చెప్పవచ్చున్నారు. అర్హత ఉండి వైఎస్ఆర్ రైతు భరోసా పథకం లబ్ది ఇంకను పొందని వారుంటే సంబందిత వార్డు లేదా గ్రామ వాలంటీర్లను, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను, మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించాలన్నారు. ఆర్బికెల్లో నిరంతరం రైతులకు సలహాలు సూచనలు అందేలా కాల్ సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉద్యానశాఖ డిడి రాజీవ్ మైఖేల్, వ్యవసాయశాఖ ఎడిలు అనుబంధ శాఖల అధికారులు, లబ్దిదారులయిన రైతులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



బాధితులకు సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి-కడప

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయనిధి కింద మంజూరైన రూ.18.40 లక్షల చెక్కులు, రూ.4లక్షల ఎల్ఒసి మొత్తం రూ.22.40 లక్షలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రస్తుతం రూ.5 లక్షల నుండి రూ.25 లక్షలకు పెంపు చేశారన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. కడప నగరంలో నాలుగేళ్లలో రూ.8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం నిధి అందజేశామన్నారు. కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 8 మందికి పైగా సిఎం రిలీఫ్ ఫండ్ కింద లివర్ ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు దాదాపు ఒక్కరికి 30 లక్షలు పైగా సాయం అందించామన్నారు. కడప నగరానికి చెందిన సయ్యద్ ఆరీఫ్, షేక్ అక్తర్ బేగం, ఎస్.అంజూమ్ బేగం, జ్యోతి దినేష్ కుమార్, ఎన్.రమేష్, ఎం.వెంకట సుబ్బమ్మ, షేక్ షబ్నామ్‌లకు రూ.18.40 లక్షలు, షేక్ సుబాన్‌వలీకి రూ.4 లక్షలు పంపిణీ చేశారు. లబ్ది పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషాకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, కె.బాబు, అజ్మతుల్లాఖాన్ కిరణ్, చెన్నయ్య, నాగేంద్ర ప్రసాద్, రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, రామ్మోహన్, అబ్దుల్ రౌఫ్, జఫరూళ్ళ, లక్ష్మీ నారాయణ, లబ్దిదారులు పాల్గొన్నారు.

టిడిపి కోసం ప్రాణాలు తెగించి పోరాడా : సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి-వేంపల్లె

తెలుగుదేశం పార్టీ కోసం ప్రాణాలు తెగించి పోరాడినా చంద్రబాబు నన్ను నమ్మలేదని శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ ఘర్ షాదీఖానాలో సతీష్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఎవరితో పోరాటం చేశానో అలాంటి సిఎం జగన్‌నే స్నేహ హస్తం అందించారన్నారు. ఆయన ఆహ్వానం మేరకు త్వరలో వైసిపిలో చేరుతున్నాని చెప్పారు. నాలుగేళ్ళుగా రాజకీయాలకు దూరంగా ఉండడంతో మళ్ళీ రాజకీయాలలోకి రావాలని నా వర్గం కోరిందని చెప్పారు. టిడిపి నా కుటుంబం అనుకున్నా కాని నాలుగేళ్ళ రాజకీయాలకు దూరంగా ఉన్నా నన్ను పట్టించుకోలేదన్నారు. నేను నమ్మిన నాయకుడు, ఆయన కుమారుడు నన్ను కొందరితో లాలూచి పడ్డానని అవమానించారని చెప్పారు. టిడిపి కోసం ప్రాణమైనా ఇవ్వడానికి సిద్ధపడ్డ నన్ను వైఎస్ కుటుంబంతో లాలూచి పడ్డానని వారు చెప్పారన్నారు. ఇంత అవమానించిన తర్వాత టిడిపిలో ఆపార్టీలో ఉండటం సరికాదనే ఆరోజు రాజీమామా చేసినట్లు చెప్పారు. నాకోసం నాతో టిడిపిలో కలిసి తిరిగిన పెద్ద నేతలు చంద్రబాబును అడిగినా ఆయన పట్టించుకోలేదని తెలిపారు. నాలుగురోజుల నుంచి పరిస్థితులు మారినట్లు చెప్పారు. సిఎం జగన్ వైసిపి నేతలను నావద్దకు పంపించి నన్ను ఆహ్వానించడం ఎంతో ఆనందం అనిపించిందన్నారు. సిఎం తన వారిని పంపించిన తర్వాత టిడిపి వారు వచ్చారని తెలిపారు. నాలుగేళ్ళుగా నేను టిడిపి వారికి కనబడలేదని చెప్పారు. ప్రతి గ్రామంలో మన అందరి గౌరవాలు నిలబడే విధంగా వైసిపిలో చేరడానికి ముందుకు వెళ్లాలని చెప్పారు. వేంపల్లెలో సిఎం జగన్ సహకారంతో సుందరీకరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. వైసిపిలో చేరిన తర్వాత సిఎం జగన్ ఆదేశిస్తే జిల్లాలో టిడిపి అసంతృప్తితో ఉన్న వారిని పార్టీలో చేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి కుమారులు రోహన్ నాగిరెడ్డి, తుషార్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం : పిసిసి


ప్రజాశక్తి - కడప : జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సాయిపేట 50వ డివిజన్ షేక్ సుల్తాన్ ఆధ్వర్యంలో పది మైనార్టీ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కార్య కర్త సైనికుల్లా పని చేయాలని చెప్పారు. షేక్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విష్ణుప్రీతమ్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు అన్వర్‌బాషా, సుల్తాన్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మల్లెం విజయ భాస్కర్, పిసిసి కార్యదర్శి చీకటి చార్లెస్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిపుల్లా, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కుల్లాయప్ప, డిసిసి ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పాలి పుల్లయ్య, మహిళా అధ్యక్షులు శ్యామలాదేవి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు వంక అరుణ్ కుమార్, కార్మిక విభాగం స్టేట్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ మెడికల్ కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి - కడప : కడప ప్రభుత్వ మెడికల్ కళాశాల(జిఎంసి) స్నాతకోత్సవ వేడుకలు ఈ నెల 29వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు రిమ్స్ యుజి బాలుర హాస్టల్ మైదానంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సురేఖ, ఆర్ఎంఒ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎహెచ్‌యూ విసి డాక్టర్ బి.ఆంజనేయ ప్రసాద్, అదనపు డిఎంఇ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.శ్రీదేవి, డాక్టర్ ఎ.సురేఖ, డాక్టర్ జివి.రమాదేవి, డాక్టర్ కె.వాణి, డాక్టర్ ఎం.సురేష్వరరెడ్డి, డాక్టర్ కె.వెంకటరాముడు, డాక్టర్ టి.శారద, డాక్టర్ వై.విజయ భాస్కర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి-కడప : ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ ఎంపికలకు కడప నోడల్ రిసోర్స్ సెంటర్‌కు సంబంధించిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాల, రాజంపేట, కోడూరు, రాయచోటి కో-ఎడ్యుకేషన్, రాయచోటి మహిళా కళాశాల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు కళాశాల, ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలకు చెందిన 306 మంది విద్యార్థులుపాల్గొన్నారు. జాబ్ మేళాలో పాల్గొన్న 25 కంపెనీలు 259 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్ర నాథ్, జెకెసి కో-ఆర్డినేటర్ సిహెచ్. రాము, జెకెసి మెంటార్లు ఎన్. సారథి, కె.మంజుల పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

విదేశాలకు మాధవరం చీరలు : ఎడి

ప్రజాశక్తి-కడప సిటీ

జిల్లాలోని మాధవరం ప్రాంతంలో తయారయ్యే చీరలను విదేశాలకు ఎగుమతులు చేయడానికి కేంద్రం ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు నాగరాజారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మాధవరంలో 200 ఏళ్ళుగా కాటన్, సిల్క్ కాటన్, ప్యూర్ సిల్క్ సారీస్ దేశంలోని నలుమూలలకు వెళుతున్నాయన్నారు. ఇక్కడ తయారు చేసిన చీరలను ఢిల్లీ రాజధాని నగరంలో ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ "భారత్ టెక్స్-2024'ను 4 రోజులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల వ్యాపార దిగ్గజలు వచ్చి తమకు నచ్చిన డిజైన్స్, వాటి నాణ్యతను తెలుసుకొని వారికి ఆర్డర్స్ ఇస్తారన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల ఎగుమతి బిజినెస్ పర్సన్స్ కూడా విజిట్ చేసి ఆర్డర్స్ ఇచ్చారన్నారు. మన రాష్ట్రం నుండి సుమారు 5 జిల్లాల చేనేత చీరలు ప్రదర్శనకు ఉంచారని చెప్పారు. మాధవరం చీరలు ప్రత్యేకంగా నిలిచాయన్నారు. మాధవరం చీరలు దేశంలోనే కాకుండా ప్రపంచ దేశంలో కూడా డిమాండ్ పెరుగుతోందని పేర్కొన్నారు. కొత్తగా మార్కెట్ అనుగుణంగా నూతన డిజైన్స్ తయారుచేసి ఇస్తామని పేర్కొన్నారు. ఇటువంటి చేనేత ప్రదర్శనలు వలన చేనేత రంగం ఇంకా ఆర్థికంగా బలపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని కార్మికుడు శ్రీరాందాస్ వెంకట్ తెలిపారు. ఇటువంటి ఇంటర్నేషనల్ ఎక్స్‌పో ప్రదర్శనలకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

హమాలీలకు ఎగుమతి కూలి రేట్లు పెంచాలి

- రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా హమాలీలకు ఎగుమతి కూలి రేట్లు పెంచాలని హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారెడ్డి కోరారు. బుధవారం బేవరేజ్ డిపో వద్ద హమాలీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగుమతి కూలీ రేట్ల ఒప్పందం ముగిసి 4 నెలలు కావస్తుందని పేర్కొన్నారు. ఎపిఎస్‌బిసిఎల్ యాజమాన్యం కొత్త మద్యం రవాణాదారునితో కొత్త ఒప్పందం చేయకుండా ఆలస్యం చస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి కూలీ రేట్లు పెంచాలని కోరారు. కార్మికులను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రఘురామయ్య, జి.రెడ్డి ప్రసాద్, ఎన్.సుబ్బారెడ్డి, రామమోహన్, పి.వెంకటరమణ, కృష్ణయ్య, నరేష్, కొండారెడ్డి, మదన్, మనోహర్ పాల్గొన్నారు.

'రాముడు' రాణించేనా?

- చల్లారని అసంతృప్తి సెగలు
- బాబు సమక్షంలో ప్రసాద్‌బాబు సమ్మతి సరే
- మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌రెడ్డి, ద్వారకనాధ్‌రెడ్డి కలిసొచ్చేనా?
- ఆసక్తికరంగా రాయచోటి రాజకీయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రాయచోటిలో టిడిపి రాణించడంపై ఆసక్తికరచర్చ నడుస్తోంది. టిడిపి అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌రెడ్డి, ద్వారకనాధరెడ్డి, యువ నాయకులు ఎస్.ప్రసాద్‌బాబు వంటి హేమాహేమీలతో పోటీపడి టికెట్‌ను దక్కించుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. వీరిద్దరినీ ఏకతాటిపైకి తేవడం గెలుపు సాధించినంత పని అవుతోంది. ఏకతాటిపై తీసుకుని వస్తే గెలుపు సులభం. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా ఎస్.బాలసుబ్రమణ్యం బరిలో నిలవనుండడం కొంత ఉపశమనం కలిగి స్తోంది. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు దగ్గరికి ప్రసాద్‌బాబును పిలిపించి సయోధ్య కుదుర్చుకోవడం ఓ ముందడుగే. కానీ మాజీఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌రెడ్డి, ద్వారకనాధరెడ్డిల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. వీరిద్దరి అసంతృప్తిని చల్లార్చడం సులభం కాదనే వాదన వినిపిస్తోంది. వీరిద్దరూ ఇప్పటికే అధికారం రుచి చూసిన వారు కావ డంతో అంగీకారం తెలిపే అవకాశాలు తక్కువ. ఒక వేళ అంగీకారం తెలిపినప్పటికీ పూర్తి స్థాయిలో సహకరించే అవకాశాలు తక్కువే. ఇదిలాఉండగా మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌రెడ్డి ఆత్మీయ సమావేశాల్లో తాను ఎన్నికల బరిలో దిగుతానని ప్రకటించిన సంగతి తెలిసిందే. టికెట్ దక్కని పక్షంలో ఇతర పార్టీలు టికెట్ ఇస్తే బరిలో నిలిచే అవకాశాలూ లేకపోలేదు. ఒకవేళ ఇదే జరిగితే రాయచోటి, చినమండెం, సంబేపల్లి, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, రామాపురం మండలాల్లో టిడిపి ఆటుపోట్లను ఎదుర్కోవలిసి వస్తోంది. లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తోంది. మరో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాధరెడ్డి టికెట్ విషయంలో చివరి నిమిషం వరకు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. వారం వారం సర్వేపై ఆధారపడి అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఎన్నికల బరిలో నిలవడానికి కావలిసిన ఆర్థిక, సామాజిక, అంగబలాలను కలిగి ఉన్న నేపథ్యంలో తనకు టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నట్లు తెలుస్తోంది. టికెట్ దక్కని నేపథ్యంలో నెలకొన్న అసంతృప్తిని క్యాష్ చేసుకునే పనిలో ఇతర పార్టీలు ఉన్నట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన సంగతి తెలిసిందే. టిడిపి, బిజెపితో పొత్తు కోసం ప్రయత్నిస్తున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. ఎందుకంటే రాయచోటిలోని 2.50 లక్షల ఓటర్లలో 44 శాతం ముస్లిమ్ ఓటర్లు కలిగిన నియోజకవర్గం. ఇంతటి లోటును అధిగమించి రాణించడం తీవ్రమైన సవాలుతో కూడుకున్న వ్యవహారం. సిట్టింగ్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పట్ల నెలకొన్న వ్యతిరేక తను, అధికార పార్టీ పట్ల నెలకొన్న నెగిటివ్ ఓటును ఆధారం చేసుకుని గెలుపు సాధిస్తామనే ఆశలను కేంద్రంలో బిజెపి సర్కారు నిర్వీర్యం చేస్తోంది. దీనికితోడు ఎన్నికల షెడ్యూలు నాటికి సిఎఎ గైడ్‌లెన్స్ విడుదల చేస్తామని కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రకటిస్తున్న నేపథ్యంలో ముస్లిమ్ ఓటర్లు చేజారిపోయే అవకాశాలు ఉన్నాయి. ముస్లిం ఓటర్ల లోటును అధిగమించడానికి పొత్తు ధర్మంలోని పార్టీల ప్రాబల్యమూ తక్కువ కావడం గమనార్హం. ఇక్కడ ఎటు చూ సినా బిజెపి, జనసేన పార్టీల ఓటర్లు చేతివేళ్ల మీద లెక్కించే పరిస్థితి నెలకొంది. ఒక పక్క చల్లారని అసంతృప్తులు, మరో పక్క ముస్లిముల ఓటర్లను కోల్పోయే అవకాశాల మధ్య తీవ్రమైన ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పవచ్చు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- డిఐఇపిసి సమావేశంలో కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు డిఐఈపిసి సభ్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరచాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలని పేర్కొన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్‌కు సంబంధించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై విస్తృతంగా అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడిపి) 2020-23 ప్రకారం వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 10 యూనిట్లకు గాను రూ.79.90 లక్షలు, వడ్డీ రాయితీకి సంబంధించి 3 యూనిట్లకు గాను రూ.8.20 లక్షల చొప్పున మొత్తం 13 యూనిట్లకు గాను రూ.88.1 లక్షల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ కృష్ణమూర్తి, జెడ్ఎం (టెక్నీకల్) శ్రీనివాస మూర్తి, ఐఎఒ లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఎపిఐఐసి ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ, వాణిజ్య పన్నుల శాఖ, ఎపిఎస్ పిడిసిఎల్ , లేబర్ శాఖల అధికారులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు



జానుమద్ది విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైవీయూ విసి, రిజిస్ట్రార్

బ్రౌన్‌శాస్త్రిగా కీర్తిగడించిన జానమద్ది

వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సి.పి.బ్రౌన్ నడయాడిన ప్రదేశంలో మొండిగోడలుగా ఉన్న బంగ్లాను జ్ఞానసౌధంగా తీర్చిదిద్ది బ్రౌన్‌శాస్త్రిగా కీర్తి గడించిన మహోన్నతవ్యక్తి డాక్టర్ జానమద్ది హనుమ చ్ఛాస్త్రి అని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం వైవీయూ ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి దశమ వర్ధంతిని, స్మారకోపన్యాసాన్ని నిర్వహించింది. జానమద్ది హనుమ చ్ఛాస్త్రి విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయం నిర్మాణం వెనుక హనుమచ్ఛాస్త్రి కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. భవన నిర్మాణం తోపాటు నిధుల సేకరణ, పుస్తక సేకరణ కోసం అనేక ప్రాంతాలు తిరిగి, అనేకమంది ప్రముఖులను కలిసి గ్రంథాలయ అభివద్ధికి పాటుపడ్డారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి సాహితీ క్షేత్రంలో గొప్ప రచయితగా హనుమచ్ఛాస్త్రి కీర్తిగాంచారన్నారు. వైవీయూ సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జానమద్దితో తనకు పరిశోధన చేస్తున్న నాటి నుంచి అనుబంధం ఉందని తెలిపారు. ప్రముఖ అవధానకవి డాక్టర్ నరాల రామారెడ్డి 'అవధాన వైభవం' అనే అంశంపై ప్రసంగిస్తూ పద్యం తెలుగుభాషకు మాత్రమే దక్కిన వరమన్నారు. కార్యక్రమంలో వైవీయూ తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య పి.రమాదేవి, ఆచార్య జి.పార్వతి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది, శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థినులు, బాలవికాస్ పాఠశాల విద్యార్థులు, గోవిందరెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, రాజారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, జోజిరెడ్డి, అలపర్తి పిచ్చయ్య చౌదరి, పుత్తా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

3న 'ఆర్తీ'లో మహిళలకు సండే మార్కెట్

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఆర్తీ ఉమెన్ సెంటర్‌లో మహిళలకు మార్చి 3వ తేదీన సండే మార్కెట్ నిర్వహిస్తున్నట్లు సెంటర్ నిర్వాహకులు పుచ్చలపల్లి సంధ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు తమ ఉత్పత్తులను, చేతితో చేసిన వస్తువులను, ఆరోగ్యకరమైన తినుబండారాలను, చిరుధాన్యాలతో చేసిన ఆహారపదార్థములు, చేతినేపుణ్యం గలవారు తమ ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తులను ప్రదర్శించడానికి, అమ్ముకొనుటకు కడపలోని ఆర్తి ఉమెన్స్ సెంటర్‌లో సండే మార్కెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కును సాధించి ఇక్కడ నిర్మించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. యువత ఉద్యోగ అవకాశాలు లేక వలసలు పోతున్నారని తెలిపారు. పాలకులకు నిరుద్యోగుల వేదన కనిపించడం లేదని పేర్కొన్నారు. స్థానికంగా పరిశ్రమలు వస్తే చదువుకున్న యువత ఎక్కడికో వెళ్లి ఉద్యోగాలు చేసే పరిస్థితి వుండదని పేర్కొన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కృషి చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలని చెప్పారు.మార్చి 2, 3వ తేదీలలో బద్వేలులో డివైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో పారిశుధ్య పనులను కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ బుధవారం ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాధికారులతో కలిసి పరిశీలించారు. కార్మికుల హాజరు పట్టిని పరిశీలించారు. కార్మికులు యూనిఫాం తప్పకుండా ధరించాలని చెప్పారు. వ్యాపారస్తులు ఫుట్‌పాత్ మీదకు వచ్చారని వాటిని తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. టిఫాపుల వద్ద కప్పులు రోడ్లపై పడేయకుండా డస్టిబిన్స్‌లో వేసేలా చూడాలని తెలిపారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయాలేదనా తనికీ చేయాలన్నారు. డ్రెయినేజీ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పేర్కొన్నారు.

టిడిపి పథకాల ప్రచారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని 39వ డివిజన్ చిలకలబావి వద్ద టిడిపి కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవిరెడ్డి ఇంటింటికి వెళ్లి పథకాలను ప్రచారం చేశారు. బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరీపుల్లా, రామ్, లక్ష్మణ్, జిలాని, జమీల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆరుగురికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : బెంగళూర్ కు చెందిన ఎక్సెల్ అర్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 6 మంది ఎంపికయ్యారు. జి.యశస్విని, పి.గౌతమి ఎస్.అఫ్రీన్, పి.అమ్మజన్, ఎస్.పావని, ఎస్.అంజుం మూడు నెలలు ట్రైనింగ్ అనంతరం వారికి ఉద్యోగం పొందుతారు. ఎంపికైన విద్యార్థులను ఎమ్‌డి డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్ నాయక్, అధ్యాపకులు అభినందించారు.



ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



స్వామివారి రథాన్ని లాగుతున్న మహిళలు

వైభవంగా శ్రీరంగనాథ స్వామి రథోత్సవం

- ఆకట్టుకున్న జానపద నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీరంగనాథ స్వామి రథయాత్ర ఎంతో శోభాయమానంగా పులివెందులలో బుధవారం జరిగింది. పూలంగళ్ల సమీపంలో ఉన్న శ్రీరంగనాథ స్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు స్వామివారికి వివిధ రకాల పూజా కార్యక్రమాలతోపాటు వాహన సేవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారి రథయాత్ర నిర్వహించారు. రంగనాథ స్వామిని పట్టణంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. గుమ్మడికాయలతో కాయకర్పూరాలను సమర్పించి భక్తులు స్వామివారి రథాన్ని లాగుతూ రంగనాథ స్వామి నామస్మరణ చేశారు. రథోత్సవం ముంగిట జానపద గేయాలు పాడుతూ నృత్యాలు చేశారు. ముందుగా పురపాలక వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ గంగాధర రెడ్డి, కౌన్సిలర్ వానపల్లి కిషోర్‌ను శ్రీ రంగనాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిటీ మెంబర్ మాధవ ఆచార్యులు సత్కరించారు. పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులను సన్మానించారు.

ఉమర్‌పై ముక్తియార్ దాడి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మినర్వ టైర్స్ యజమాని ఉమర్ వైసిపికి మద్దతిస్తున్నారని.. తెలుగుదేశం నాయకుడు ముక్తియార్ రాజకీయదురుద్దేశంతో స్థల వివాదాన్ని సాకుగా చూపి ఆయనపై దాడి చేశాడని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి ఆరోపించారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా విడిగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారస్తులైన ఉమర్ సోదరులు తమ కుటుంబంతో ఎప్పటినుంచో మిత్రత్వం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తరచుగా ఆ ఇంటికి తాము రాకపోకలున్నాయన్నారు. ఈ క్రమంలో ఉమర్ సోదరులు వైసిపికి సానుభూతిపరులుగా ఉన్నారన్నారు. వివాదాస్పదమైన స్థలం విషయంలో ముక్తియార్ ఉమర్‌ను అన్న క్యాంటీన్‌కు పిలిపించి దాడి చేసి ఇతని వద్దనున్న స్థల డాక్యుమెంట్లు, కారు తాళాలు దౌర్జన్యంగా తీసుకున్నట్లు తెలిపారు. ముక్తియార్‌తోపాటు మాజీ కౌన్సిలర్ ఖలీల్ మరో ఇద్దరు దాడికి పాల్పడ్డారని రాచమల్లు ఆరోపించారు. తాను స్వయంగా సిసి ఫుటేజీలు పరిశీలించానన్నారు. ఈ దాడిలో తనకెలాంటి సంబంధంలేదని ముక్తియార్ మతగ్రంథంపై ప్రమాణం చేస్తే తాను నామినేషన్ కూడా వేయకుండా, ఊరు విడిచి పోతానని.. సంబంధం ఉందని తాను నిరూపిస్తానని అప్పుడు ముక్తియార్ ఊరు విడిచి పోవాలని సవాల్ విసిరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా పాల్గొన్నారు.

రోడ్డు కోసం ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ఐదవ కౌన్సిల్ వార్డు మహేశ్వర్ నగర్‌లో బుధవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మహిళలు నిలదీశారు. ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు అమలుపై ప్రజలను ఆరా తీశారు. స్థానిక మహిళలు రోడ్డు సరిగా లేదని, ఎక్కడి నీరు అక్కడే నిలుస్తున్నాయని, వర్షాకాలం వస్తే పరిస్థితి దారుణంగా ఉందని ఎమ్మెల్యేను నిలదీశారు. నూతన రోడ్డు నిర్మించాలని చర్యలు తీసుకుంటామంటూ మహిళలకు ఎమ్మెల్యే సర్దిచెప్పారు. ఐదేళ్ల నుండి వేయని రోడ్డు ఇప్పుడు ఎలా వేస్తారు అనుకుంటూ నిట్టూర్పుతో మహిళలు అక్కడి నుండి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే తన కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ సమస్య పరిష్కారం

ఖాజీపేట : మండలం పరిధిలోని చెముళ్లపల్లె పంచాయతీ బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో కర్రలపై విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. వారి ఇబ్బందులను ఎపిఎస్ ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డికి వివరించారు. కాలనీలోని అంబవరం పీరయ్య ఇంటి వద్ద నుండి సంధ్యాల దస్తగిరి ఇళ్ల మధ్య ఏడు స్తంభాలు, కేబుల్ అవసరం అని చెప్పడంతో రెడ్యం సమస్యను ఆశాఖ ఎస్ఈ రమణయ్య దృష్టికి రాత పూర్వకంగా తీసుకెళ్లారు. ఎడి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ఛార్జి ఎఇ గోవర్ధన్‌రెడ్డి దృష్టికి కూడా తెచ్చారు. ఇందుకు స్పందించిన అధికారులు బుధవారం సాయంత్రం పనులు పూర్తి చేశారు. రెడ్యం దగ్గరుండి పనులు చేయడంతోపాటు గ్రామస్తులచే కంపచెట్లు కొట్టించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రెడ్యంకు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప–తాడిపత్రి ప్రధాన రహదారి కొత్తపల్లె గ్రామం వద్ద మంగళవారం అర్ధరాత్రి ఏదో తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (58) అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జమ్మలమడుగు ఆసుపత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు.

చిన్నారిపై దూసుకెళ్లిన ఇసుక టిప్పర్

- కాలికి తీవ్ర గాయం

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని కొత్తగాలివారిపల్లె వద్ద బుధవారం వేగంగా టిప్పర్ వచ్చి అదే గ్రామానికి చెందిన చిన్నారి రక్షితపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రక్షిత కాలుకు తీవ్ర గాయమైంది. 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గ్రామాల వీధుల్లో వాహనాలు వేగంగా ఇసుక టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు తెలిపారు. వీటిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రక్షితను మెరుగైన చికిత్స కోసం వేలూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో బుధవారం బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పులివెందుల నుండి ప్రొద్దుటూరు వెళ్లవలసిన ఎపి 39 యుహెచ్ 0549 నెంబర్ బస్సు బస్టాండ్‌లోకి ప్రవేశించే సమయంలో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికురాలు లక్ష్మమ్మను ఢీకొంది. ఆమె తలకు తీవ్ర రక్తగాయమైంది. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. సోమవారం నుండి ఆర్‌టిసి అధికారులు బస్టాండ్ వద్ద ఇన్, అవుట్ నిబంధనలతో బోర్డులు పెట్టారు. ఇంతకాలం ఏ రూటుకు పోవలసిన బస్సులు ఆ రూటుకు వెళ్లేలా బస్టాండ్‌లోకి రాకపోకలు సాఫీగా జరిగేవని, ఇన్, అవుట్ అంటూ కొత్త నిబంధనల కారణంగానే ప్రమాదం సంభవించిందని స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. కొత్త విధానం వల్ల ప్రయాణికులు ఏ బస్సు ఎటు వెళ్తుందో తెలియక ఇబ్బందులు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇన్, అవుట్ నిబంధనలు తొలగించి యథావిధిగా బస్సులు ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

- రూ.1,33,600 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - గోపవరం

మండలంలోని పిపి కుంట గ్రామానికి తూర్పు వైపున కంపచెట్ల దగ్గర బుధవారం పేకాట, లోపల బయట, మంగ తాయారు, ఆడుతున్న ఐదు మందిని అరెస్టు చేశామని రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.1,33,600 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విస్తారంగా నువ్వుల పంట సాగు

ఎకరాకు రూ.3 వేలు పెట్టుబడి.. ఐదు క్వింటాళ్ల దిగుబడి - క్వింటా ప్రస్తుతం ధర రూ.16 వేలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లి, పులివెందుల, తొండూరు మండలాలలో రైతులు నువ్వుల పంటను విస్తారంగా సాగు చేశారు. నువ్వుల పంటకు పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది అటు ఖరీఫ్, ఇటు రబీలోగాని వరుణదేవుడు కరుణించలేదు. ఏదో తుఫాన్ పుణ్యమా అని డిసెంబర్‌లో వర్షాలు పడడంతో భూమి పదును అయింది. రైతులు చేసేదేమిలేక నువ్వులు, జొన్న, బుడ్డశనగ వంటి పంటలను సాగు చేశారు. పంటలు బాగా వస్తున్న దశలో వరుణదేవుడు ముఖం చాటేయడంతో, పిబిసి కాలువ కింద నీళ్లు అధికారులు వదిలారు. మోటర్లు, ఇంజన్ల ద్వారా రైతులు పంట పొలాలను తడుపుకుంటున్నారు. రైతులు నువ్వుల పంటను విస్తారంగా సాగు చేశారు. ఈ పంటకు పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ. ఎకరా నువ్వుల పంట సాగు చేయాలంటే రెండు కిలోల నువ్వులు రూ.500, పంట విత్తనం కోసం మరో రూ.500, కలుపు, ఉడుపు తీయడానికి ఇంకో రూ.1000 తెగుళ్ల, నివారణకు మరో వెయ్యి రూపాయలు కలిపి ఎకరానికి నువ్వుల పంట సాగు కోసం రూ.3వేలు రైతులు ఖర్చు చేశారు. ఎకరానికి దిగుబడులు నాలుగు నుంచి 6 క్వింటాల వరకు వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాల్ ధర రూ.16వేల నుంచి రూ.20వేలు పలుకుతోంది. ఈ పంట వల్ల రైతులకు ఆదాయం రానుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 1000 ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశారు. రైతులకు ఎకరానికి సుమారు రూ.60వేల నుంచి రూ.80వేల వరకు ఆదాయం రానుంది.



సాగు చేసిన నువ్వుల పంట

దేశాభివృద్ధికి సైన్స్ మూలం



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దేశాభివృద్ధికి సైన్స్ మూలమని జిల్లా సైన్స్ సమన్వయకర్త డి.వి.సుబ్బానాయుడు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో స్థానిక తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్‌లో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిశిత పరిశీలన, ప్రయోగాలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. సైన్సు ఉపాధ్యాయులు నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టడానికి సైన్స్ ప్రాజెక్టులతో కూడిన విజ్ఞాన మేళా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సైన్సు ఉపాధ్యాయురాలు నిర్మల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న మంత్రాలు, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలను, రంగోలి ముగ్గులలో వేసిన సైన్స్ పటాలను తిలకించడానికి గ్రామస్తులు పెద్ద మొత్తంలో తరలివచ్చారు. ఎపి శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహు మతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘురామయ్య, నాగభూషణం, అంకాల కొండయ్య, వెంకటనాయక్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. **చాపాడు :** మండలంలోని నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరసింహ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకుంటూ ముందుకు సాగాలన్నారు. విద్యార్థులందరూ ఫిజిక్స్, బయాలజీ పాఠ్యాంశాలలోని బొమ్మలను ముగ్గుల రూపంలో పాఠశాల క్రీడా మైదానంలో వేశారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. **ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో..** సైన్స్ డే సందర్భంగా స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రొద్దుటూరు డివిజనల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి మాట్లాడుతూ ఇక్కడ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయన్నారు. భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ సి.వి.రామన్ జయంతి సందర్భంగా ఎడ్యుఫైర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడ్యుఫైర్–24లో 365 డిగ్రీస్ వీడియో ప్రొజెక్టర్ కడప వన్య ప్రాంతంలో మాత్రమే దర్శనమిచ్చే కలివికోడి నిర్మాణం చూపరులకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజబాబు ఆధ్వర్యంలో సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామసుబ్బమ్మ, ఇస్మాయేల్, ప్రసాద్, జయాకర్, మాధవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నగరంలోని మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ సోషల్ వర్కర్ మొహమ్మద్ తాజుద్దీన్ మాట్లాడుతూ దాదాపు 85 ప్రాజెక్టులను అద్భుతంగా తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. మౌలానా ఆజాద్ యూనివర్సిటీ 5 ప్రాజెక్టులు పీస్ స్కూల్ తరపున తీసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్య గురించి అద్భుతమైన సేవలందిస్తున్న పీస్ స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పీస్ స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు

అత్యాధునిక శాస్త్ర పరిశోధనలతో ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిచి భవిష్యత్తులో వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటుందని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం–2024 సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ఎ.చంద్ర శేఖర్, అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్.మాధవి, మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ సహ ఆచార్యులు డాక్టర్ ఎం.మమతకుమారి పాల్గొన్నారు. **గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్‌లో** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎవిఆర్ చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి, సిఇఒ ఎ.ఎల్.వివేకానంద, డి.పల్లవి, ప్రిన్సిపల్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహ, క్యాంపస్ ఇన్‌ఛార్జి కె.విశ్వేసరరెడ్డి పాల్గొన్నారు. **శ్రీచైతన్య స్కూల్‌లో** విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. చెన్నూరు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇందిరా నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీన్ రెడ్డి కుమార్, ప్రైమరీ ఇన్‌ఛార్జి అనురాధ పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపల్ గీత ఆధ్వర్యంలో సైన్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ డి.కె.వెంకటరమణ హాజరయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా బుధవారం నిర్మల స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు ఎస్.సునీత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలభారతం మాట్లాడారు. కార్యక్రమంలో సమత విభాగం జిల్లా నాయకులు పి.కామేశ్వరమ్మ, కరీముల్లా, మేరీ, మంజుల, కమురుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** నారాయణ పాటశాలలో సైన్స్ ఫెయిర్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎజిఎం చెన్నకేశవ రాజు మాట్లాడుతూ మన జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎల్.సునీతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు **కమలాపురం :** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(ఆప్ కాస్ట్)ఆధ్వర్యంలో పెద్ద చెప్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, అప్‌కాస్ట్ జిల్లా అకాడమిక్ కో–ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు సైన్స్ ప్రదర్శన, చిత్రలేఖనం , బేబీ సైన్స్ ప్రగతిపై వక్తృత్వ పోటీలను నిర్వహించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో బహు మతులను అందజేశారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు ఎన్. రాజేశ్వర్ ప్రసాద్, కె.బాబు, వై.లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సివి రామన్ గొప్పతనాన్ని వివరించారు. డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. విద్యార్థులు రూపొందించిన నమునాలు (ప్రాజెక్ట్స్) ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ సరస్వతమ్మ, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వేంపల్లె :** మేధా సంపత్తిని పెంచుకొనేందుకు సైన్స్ పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని శ్రీనివాస స్కూల్ కరస్పాండెంట్ కేశవులు, శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య, శ్రీనివాస పాఠశాలలో సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్సు ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి, శ్రీనివాస పాఠశాల ఉపాధ్యాయులు, శ్రీచైతన్య పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **కడప :** ప్రతి విద్యార్థి గొప్ప శాస్త్రవేత్తగా భవిష్యత్తులో ఎదగాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) సిఇఒ సి.సాయి గ్రేస్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు బుధవారం చెమ్ము మియాపేటలోని గంగాభవాని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీ య సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి సైన్స్ ఫెయిర్ ప్రారం భించారు. పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ ఆవిష్కరణలను సంద ర్శించి, వాటిలో వినూత్నంగా ఆవిష్కరించిన వారికి బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ, అధ్యాపకులు సోఫి యా, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయడు, సిబ్బంది వి.వి. నారాయణ పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** శాస్త్రీయ వైఖరులతోనే దేశాభివృద్ధి సాధ్యమని దిన్నెపాటి వికాస్ స్కూల్ అధినేత బసిరెడ్డి తెలపారు. భగత్‌సింగ్ నగర్‌లో దిన్నెపాటి వికాస్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్ పంపిణీ చేశారు. **ప్రొద్దుటూరు :** సైన్స్ ప్రజల ఆలోచనలను పెంచడంతోపాటు జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుందని జనవిజ్ఞానవేదిక (జెవివి) నాయకులు డాక్టర్ డి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. జెవివి ఆవి ర్భావదినోత్సవం, సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం జెవివి జెండా వందనం చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సైన్స్ ఎంతో అవసరమన్నారు. సైన్స్ భావాలు పెరిగేలా జెవివి కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోకి కూడా జెవివి శాస్త్రీయ దృక్పథంపై పనిచేసేలా కృషి చేయాలన్నారు. జెవివి అధ్యక్షులు డాక్టర్ వి.శివారెడ్డి, ఉపాధ్యక్షులు వి.రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పాల్గొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదలమైన తమకు ప్రభుత్వం సొంతగూటికోసం 15సంవత్సరాల క్రితం అమృత్ నగర్‌లో స్థలం ఇచ్చి, అప్పటి నుండి ఇప్పటి వరకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని లబ్ధిదా రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్క రించాలని పలుమార్లు మొరపె ట్టుకున్నా మన్నారు. ఫలితం లేకపోవడంతో రాబోయే ఎన్నికల్లో తామంతా ఎమ్మెల్యేగా పోటీ చేసి సమస్యను పరిష్కరిం చుకుంటామని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో హరి, హసీనా, మల్లికాభాను, నరసింహ, గోవిందమ్మ, శంషాద్, షకీలా, సరస్వతి, సుబ్బమ్మ పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న అమృతనగర్ వాసులు



నియామక పత్రం అందుకుంటున్న నాగరాజా

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేమా నాగరాజా

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా వేంపల్లెకు చెందిన వేమా నాగరాజాను నియమించారు. ఆ మేరకు బుధవారం వేంపల్లెలో వేమా నాగరాజాకు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లా జనరల్ సెక్రటరీగా పదవి వచ్చినందుకు నాగరాజా తులసిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవ, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, జిల్లా కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, అమర్నాథ్‌రెడ్డి, మదనపల్లె పార్లమెంటు అభ్యర్థి సింగం రామకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బిజెపి, వైసిపి, టిడిపి రైతు వ్యతిరేక పార్టీలు

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి, టిడిపి, వైసిపిలు రైతు వ్యతిరేక పార్టీలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని 2008లోనే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ.70 వేల కోట్లు వ్యవసాయ రుణాలను, సమైక్యాంధ్రలో రూ.12 వేల కోట్లు రుణాలను మాఫీ చేసిందని గుర్తు చేశారు. సాగునీటి రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు ఎక్కువ చేసి ఖర్చు పెట్టేవని చెప్పారు. విత్తన సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలకు గిట్టుబాటు ధరలు, బిందు, తుంపర సేద్యం, సున్నా వడ్డీ రుణాలు, పావలా వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్ సరఫరా వంటి రైతు అనుకూల విధానాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పండుగ చేసినట్లు చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతులను రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్నట్లు చెప్పారు. కనీస మద్దతు ధరకు చట్టబద్రత కల్పించాలని కోరుతున్న రైతులపై కాల్పులు జరిపారన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఆర్‌టిడి కళాశాల విజయకేతనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి నెలలో వైవియు నిర్వహించిన డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ ఎల్.తరునేంద్ర శేఖర్ తెలిపారు. కళాశాల థర్డ్ బీఎస్సీ బయోటెక్ ఐదవ సెమిస్టర్‌లో డి.మహబూబ్ చాన్ 9.57, టీ భావన 9.56, వి.హారతి 9.04, థర్డ్ బిఎస్సి ఎంఎస్సిఎస్. ఐదవ సెమిస్టర్‌లో ఎస్‌సి నౌరిన్ తాజ్ 9.56, డి.తజ్‌కియాఖానం 8.95, థర్డ్ బీకాం కంప్యూటర్ అప్లికేషన్ ఐదవ సెమిస్టర్‌లో బి.సుకన్య 8.64, ఎస్.మిస్బా అంజు 8.62, జే జగదీశ్వర్‌రెడ్డి 8.52, సెకండ్ బీఎస్సీ బయోటెక్ మూడో సెమిస్టర్‌లో బుస్రాఫిరదోస్ 9.28, వై.వి.స్రవంతి 9.12, టీ.సాయి లావణ్య 8.93, సెకండ్ బిఎస్‌సి ఎంఎస్‌సిఎస్ మూడవ సెమిస్టర్‌లో కె.యశస్విని 8.9, డి.హబీబుల్లా 8.3, సెకండ్ బికాం కంప్యూటర్ అప్లికేషన్ మూడవ సెమిస్టర్‌లో ఎస్ రుబీనా 8.58, వై సుగుణ కుమారి 8.34 జిపిఎ సాధించారన్నారు. మంచి ప్రతిభ కనపరచిన వీరిని ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

టైలర్స్ డే సందర్భంగా బుధవారం ఎర్రగుంట్ల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడు కలు నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా పట్ట ణంలోని దర్జీలు నాలుగు రోడ్ల కూడలి లోని అల్లసాని పెద్దన్న విగ్రహా నికి పూల మాలలు వేశారు. అనం తరం ఆర్ఆర్ టైలర్స్ వద్ద కేక్ కట్ చేసి సంబ రాలు జరిపారు. కార్యక్రమంలో టైలర్లు రఘురామిరెడ్డి, వీరాంజనేయులు, ప్రతాప్, విజయ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రేపల్లె గ్రామంలో నూతన రామాలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. రూ.40 లక్షల దేవాదాయశాఖ నిధులతో నూతన దేవాలయాన్ని స్థానికులు నిర్మిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, జడ్పీటీసీ భర్త శాంతరాజు, సర్పంచ్ మునీంద్ర, వైసిపి నాయకులు జయసుబ్బారెడ్డి, మహేష్ యాదవ్, నిరంజన్‌రెడ్డి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎస్.నాగిరెడ్డి